నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, సోమవారం 30 డిసెంబర్ 2024 | RANGAREDDY

# నేరాల అడ్డాగా నగరం

**రెండు కమిషనరేట్లలో భారీగా పెరిగిన క్రైమ్‌రేట్**
**నేరాల కట్టడిలో పోలీస్ సిబ్బంది తడబాటు**
**కొరవడిన జవాబుదారితనం..**
**నిర్వహణ లేక పనిచేయని అనేక సీసీ కెమెరాలు**
**నేరగాళ్లను పట్టుకోలేని పరిస్థితి**
**విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలంటున్న నగరవాసులు**



సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ): విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వకపోవడంతోనే హైదరాబాద్, సైబరాబాద్‌లలో అధిక నేరాలు నమోదయ్యాయి. అదే రాచకొండ కమిషనరేట్‌లో సైకిల్ పెట్రోలింగ్, నిర్మానుష్య ప్రాంతాల్లోనూ పెట్రోలింగ్ నిర్వహించడంతో రెండు కమిషనరేట్ల కంటే తక్కువగానే నేరాలు నమోదయ్యాయనే వాదన వినిపిస్తున్నది. హైదరాబాద్‌లో రాత్రి వేళల్లో సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు పెరిగిపోవడం, హత్యలకు కూడా దొంగలు తెగబడిన ఘటనలు ఉన్నాయి. సరైన సమయంలో పెట్రోలింగ్ పోలీసులు స్పందించలేదని.. విజిబుల్ పోలీసింగ్ లేకపోవడంతో సెల్‌ఫోన్ స్నాచర్లు రెచ్చిపోయారనే ఆరోపణలు వస్తున్నాయి. అదే కోవలో సైబరాబాద్‌లోనూ అధికంగా కేసులు నమోదయ్యాయి. ఇటీవల ట్రై పోలీస్ కమిషనరేట్ పోలీసులు విడుదల చేసిన వార్షిక నివేదికలో సైబరాబాద్‌లో 64%, హైదరాబాద్‌లో 41%, రాచకొండలో 4% నేరాలు పెరిగినట్లు వెల్లడైంది.

### వచ్చే ఏడాదైనా గాడిలో పడుతుందా..

మొదటి సంవత్సరం భారీగా నేరాలు నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. వచ్చే ఏడాదైనా శాంతి భద్రతలు గాడిలో పడుతాయా? అని నగర వాసులు చర్చించుకుంటున్నారు. పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేస్తూ..విజిబుల్ పోలీసింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తే.. నేరాలు తగ్గించేందుకు అవకాశముంటుందని సూచిస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సిబ్బంది కూడా సిటీ పోలీసింగ్‌పై పట్టు తెచ్చుకోవాలని.. ఉన్న వనరులను ఉపయోగించుకుంటూ నేరాలను తగ్గించేందుకు నిరంతరం ప్రయత్నిస్తే..ఉత్తమ ఫలితాలు వస్తాయంటూ ప్రజలు సూచనలు చేస్తున్నారు.

## నేరం జరిగితే..

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో విజిబుల్ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తూ పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశారు. ప్రతి పెట్రోలింగ్ వాహనం ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించేది. ఆయా పెట్రోలింగ్ వ్యవస్థ పర్యవేక్షణను నిరంతరం ఐటీ సెల్ నుంచి పరిశీలించారు. పోలీసులు ఎక్కువగా బయట కనిపిస్తుండటంతో దొంగతనాలు చేసేవారు... ఇతర నేరాలు చేసేవారిలో భయం అనేది ఉండేది. ఏం చేసినా పోలీసులకు దొరికిపోతామనే భయం ఆయా నేరగాళ్లలో ఉండేది. దీంతో చాలా వరకు నేరాల సంఖ్య తగ్గిపోయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదటి 8 నెలల పాటు వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది. తరచూ అధికారులను మారుస్తూ క్షేత్ర స్థాయిలో ఏం జరుగుతుందనే విషయాన్ని కూడా పట్టించుకోలేని పరిస్థితి నెలకొన్నది. కిందిస్థాయి సిబ్బందిలో జవాబుదారితనం కొరవడింది. అంతర్రాష్ట్ర ముఠాలు తిరిగి హైదరాబాద్ వైపు రావడం మొదలుపెట్టాయి. లక్షలాది సీసీ కెమెరాలు పనిచేయకుండా పోయాయి. కెమెరాల నిర్వహణ గురించి ఎవరూ పట్టించుకోకపోవడంతో చాలా వరకు కెమెరాలు పాడయ్యాయి. నేరం జరిగితే వెంటనే నేరగాళ్లను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

## ముగ్గురు నకిలీ డాక్టర్లపై కేసు.. దవాఖానలు సీజ్..

వికారాబాద్, డిసెంబర్ 29 : వికారాబాద్ జిల్లాలో నకిలీ డాక్టర్లు రోజురోజుకూ వెలుగులోకి వస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారులు తనిఖీలు నిర్వహించి ముగ్గురు నకిలీ డాక్టర్లను గుర్తించి స్థానిక పోలీసులకు అప్పజెప్పారు. దీంతో శనివారం వికారాబాద్‌లోని జీ నాగేందర్, కే నాగయ్య, ఎం.దానప్పలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ముగ్గురికి సంబంధించిన దవాఖానలను సైతం వైద్యాధికారులు సీజ్ చేశారు.

# నార్త్ సిటీపై ఏం చేద్దాం ?

**ప్రభుత్వ ఆదేశాల కోసం హెచ్ఎంఆర్ఎల్ ఎదురుచూపులు**

సిటీబ్యూరో: నార్త్ హైదరాబాద్‌కు అత్యంత కీలకమైన మెట్రోపై హెచ్ఎంఆర్ఎల్ ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తోంది. రెండో దశ విస్తరణలో భాగంగానే నార్త్ సిటీ మెట్రోను నిర్మించాలనే డిమాండ్ పెరుగుతూ ఉండగా, ఫేస్-2 ప్రాజెక్టుపై ప్రభుత్వం కీలక ప్రకటన చేయనున్నదంటూ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఓ సమావేశంలో ప్రకటించారు. దీంతో నార్త్ సిటీ మెట్రో విషయంలో ఏం జరుగుతుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కాగా నార్త్ సిటీ ప్రతిపాదనలు లేకుండానే డీపీఆర్ కేంద్రానికి చేరగా, అనుమతులు రావడమే ఆలస్యం అన్నట్లుగా చూస్తున్నారు. కానీ రెండు నెలలుగా ప్రతిపాదనలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. డిసెంబర్ 30న జరిగే క్యాబినెట్ ఏజెండాలో పెట్టాలంటూ నగరవాసులు కోరారు. కానీ క్యాబినెట్ సమావేశం వాయిదా పడడంతో... ఈ విషయం మరింత సంక్లిష్టంగా మారింది. నార్త్ సిటీ మెట్రోను రెండో దశలోనే చేపట్టాలని ఆ ప్రాంత వాసులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఇటీవల మెట్రో ఫేస్-2 విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేసింది.



షాబాద్ మండలంలోని కుమ్మరిగూడలో యాసంగి సాగుకు సిద్ధంగా ఉన్న వరి నారు

**పంట పెట్టుబడిపై ప్రకటనలకే పరిమితమవుతున్న సర్కార్**
**రంగారెడ్డి జిల్లాలో అన్నదాతలపై సీజన్‌కు రూ.360 కోట్ల ఆర్థిక భారం**
**పాత అప్పులు తీర్చక, కొత్త అప్పులు పుట్టక అవస్థలు**
**పంటల సాగుకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు**
**కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని డిమాండ్**

# యాసంగికైనా.. భరోసా అందేనా..?



**కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా రైతుభరోసా పథకం జాడేలేదు. ఇప్పటికే వానకాలంలో పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టిన రేవంత్ ప్రభుత్వం.. ఈ రబీ సీజన్‌లోనైనా ఇస్తుందా..? లేదా..? అనే ఆందోళన అన్నదాతలను వెంటాడుతున్నది. ఖరీఫ్‌లో పంటల సాగుకు సర్కారు పెట్టుబడి సాయాన్ని అందించకపోవడంతో వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకొచ్చి పంటలను సాగు చేశామని.. అప్పటి అప్పులే ఇంకా తీరలేదని.. కొత్తగా అప్పులు పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ హయాంలో ఏడాదికి రెండు పంటలకు అదునుకు పెట్టుబడి సాయం అందడంతో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంటలను సాగు చేసుకున్నామని రైతులు పేర్కొంటున్నారు. రేవంత్ సర్కారు.. ఇప్పుడిస్తాం.. అప్పుడిస్తామనే ప్రకటనలు మాని రైతుభరోసా పథకం కింద వెంటనే అన్నదాతలకు పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.**

**-షాబాద్, డిసెంబర్ 29**

2023 ఖరీఫ్ సీజన్ గణాంకాల ప్రకారం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజవర్గాల పరిధిలోని 27 మండలాలకు సంబంధించి సుమారు 2.80 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ.5 వేల చొప్పున ప్రతి సీజన్‌కూ రూ. 360 కోట్ల చొ ప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హామీ ప్రకారం ఒక్కో సీజన్‌కు ఎకరాకు రూ.7,500 చొప్పున అందజేస్తే రూ. 400 కోట్లకు పైగా రైతుల అకౌంట్లలో జమ చేయాల్సి ఉంటుంది. ప్రతిఏటా అక్టోబర్ నుంచి యాసంగి సీజన్ మొదలవుతుంది. గత ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా ఇవ్వకపోవడంతో సుమారు రూ. 360 కోట్లు రైతులపై భారం పడింది. ఈ యాసంగికి కూడా మరో రూ. 360-రూ.400 కోట్ల మేర ఆర్థిక భారం పడే అవకాశముంది. సర్కారు వానకాలం, యాసంగి కలిపి ఇవ్వాలంటే ఎకరానికి రూ.15 వేల చొప్పున ఈ భారం రెట్టింపు కానున్నది. గత బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు పథకం ప్రారంభమైన ప్పటి నుంచి నిరాటంకంగా కొనసాగింది. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసాను జాప్యం చేస్తున్న కారణంగా సాగు విస్తీర్ణం తగ్గిపోయే ప్రమాదం ఉన్నది.

### యాసంగి సాయం కోసం ఎదురుచూపు...!

రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ పంట పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడంతో.. ఈ యాసంగికైనా ఇస్తుందా..? అని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తు న్నారు. వానకాల పంటల సాగుకు రైతులు అప్పులు చేశారు. పంట చేతికొచ్చే సమయానికి వర్షాలతో పంటలు దెబ్బతిని అనుకున్న స్థాయిలో దిగుబడులు రాలేదు. దీనికి తోడు పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు ఏ విధంగా తీర్చాలో తెలియక అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేలు ఇస్తుంటే, ఈ ప్రభుత్వం రూ.15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు రూపాయీ చెల్లించకపోవడంతో రైతులు మండి పడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15000 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.

### రైతుభరోసా వెంటనే అందించాలి



ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసాను అందించాలి. గత ప్రభుత్వం ఏడాదికి రూ.10వేలు అందించి రైతులకు అండగా నిలిచింది. రేవంత్ సర్కారు పంట పెట్టుబడి సాయాన్ని అందించకపోవడంతో అప్పులు తీసుకొచ్చి పంటలను సాగు చేస్తున్నాం.

– పి.కుమార్, కుమ్మరిగూడ(షాబాద్)

### రైతులను మోసం చేసింది..



ఎన్నికల్లో విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ అలవి కాని హామీలిచ్చింది. రైతులను నిలువునా మోసం చేసింది. పంట రుణాల మాఫీ సగం మందికి కూడా కాలేదు. ఎకరానికి రూ.7,500 చొప్పున రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పటికీ రూపాయీ ఇవ్వలేదు. వానకాలం సీజన్ పెట్టుబడి సాయాన్ని ఎగ్గొట్టడంతో అన్నదాతలు అప్పులు చేసి పంటలను సాగు చేసుకున్నారు. ప్రభుత్వం రైతు భరోసాపై ప్రకటనలకే పరిమితమైంది.

– గంగిడి భూపాల్‌రెడ్డి, హైతాబాద్(షాబాద్)

# ప్రైవేట్‌కు పారిశుధ్య నిర్వహణ

## 64.40 కిలోమీటర్ల కారిడార్లలో స్వీపింగ్ పనుల అప్పగింతకు ఏర్పాట్లు



చిలుకానగర్‌లో రహదారిపై పేరుకుపోయిన వ్యర్థాలను తింటున్న పశువులు

**ఏటా ఖజానాపై రూ. 24కోట్ల ఆర్థిక భారం**
**ప్రైవేటీకరణ విధానాన్ని వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు**

సిటీబ్యూరో, డిసెంబర్ 29 (నమస్తే తెలంగాణ ) : మూలిగే నక్కపై తాటి పండు పడిందన్న చందంగా..అప్పుల ఊబిలో కూరుకుపోయిన జీహెచ్ఎంసీ ఖజానాపై మరింత ఆర్థిక భారం మోపే నిర్ణయాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సంస్థ రూ. 6530కోట్ల అప్పులకు రోజు వారీ మిత్తి రూ. కోటికి పైగా చెల్లింపులు జరుపుతున్నారు. ప్రతి నెలా 1వ తేదీ వచ్చిందంటే చాలు జీతభత్యాలు, పెన్షన్లు చెల్లించేందుకు ఆర్థిక విభాగం నానా తంటాలు పడుతున్నది. ఈ నేపథ్యంలోనే పారిశుధ్య నిర్వహణను ప్రైవేట్‌పరం చేసి మరింత భారం మోపేందుకు శానిటేషన్ విభాగం రంగం సిద్ధం చేసింది. పర్యాటక ప్రాంతాలు, వీవీఐపీ/వీఐపీలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల పారిశుధ్య నిర్వహణను 73 కిలోమీటర్ల మేర రహదారులను అప్పగించారు. 24 గంటలూ స్వీపింగ్ జరిగేలా మెకిలిన్, ఇక్సోరా కంపెనీలకు ఈ బాధ్యత అప్పగించారు. ఇందుకుగానూ కిలోమీటర్‌కు సగటున నెలకు రూ.3.12 లక్షలు ఖర్చు చేస్తున్నారు. వాస్తవంగా ఇదే పనిని కార్మికుల స్వీపింగ్‌కు నెలకు అయ్యే వ్యయం రూ.40వేలు మాత్రమే. కార్మికులతో పోలిస్తే ప్రైవేట్‌కు చెల్లిస్తున్నది ఎనిమిది రెట్లు అధికం. ఈ క్రమంలోనే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేట్ విధానంపై తీవ్ర స్థాయిలో అరోపణలు వస్తుండగా, తాజాగా అధికారులు మరో 64.40 కిలోమీటర్ల మేర కారిడార్లను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇదే జరిగితే సంస్థపై నెలకు రూ. 2 కోట్ల చొప్పున ఏటా రూ. 24కోట్ల ఆర్థిక భారం పడనున్నది. గతంలోనే అప్పగించిన రోడ్లకు ప్రస్తుతం ఏటా రూ. 22.46 కోట్లు చెల్లిస్తున్నారు. ఇక నుంచి ఈ మొత్తం రూ. 47 కోట్లకు పెరగనున్నది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న సంస్థకు ఈ నిర్ణయం మరింత అదనపు భారమే అని చెప్పాలి.

### వ్యతిరేకిస్తున్న కార్మిక సంఘాలు

దేశ, విదేశీ సందర్శకులు రానున్న దృష్ట్యా పర్యాటక ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని, వీవీఐపీలు, వీఐపీలు రాకపోకలు సాగించే మార్గాల్లో చెత్తా చెదారం కనిపించవద్దని 24 గంటల స్వీపింగ్‌కు ప్రైవేట్ సంస్థలకు అప్పగించారు. 27 టూరిస్ట్ ప్రాంతాలు, 73 కిలోమీటర్ల మేరలోని చార్మినార్, సాలార్జంగ్ మ్యూజియం, మక్కా మసీదు, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతాలను ఇక్సోరా కార్పొరేట్ సర్వీస్ ప్రై.లి శానిటేషన్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సదరు ఏజెన్సీ గడిచిన కొన్నేండ్లుగా ఆయా ప్రాంతాల్లో శానిటేషన్ బాధ్యతలను చేపడుతున్నది. రోజుకు మూడు సార్లు స్వీపింగ్ (చెత్త ఊడవడం నుంచి ఎత్తివేసే ప్రక్రియ వరకు), ప్రత్యేక సిబ్బంది, సూపర్‌వైజర్లతో కలిసి శానిటేషన్ నిర్వహిస్తున్నారు. తాజాగా, సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలోని 64.40 కిలోమీటర్ల పరిధిలోని కారిడార్లను ఏజెన్సీలను అప్పగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల తాజా నిర్ణయంపై కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కార్మికుల పొట్ట కొట్టే విధానాలను అడ్డుకుంటామని హెచ్చరిస్తున్నాయి.